
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
బుధవారం 14 ఆగస్టు 2024

అక్కరకురాని ఆర్వో ప్లాంట్

- తుది దశలో నిలిచిపోయిన నిర్మాణాలు
- మూడేళ్లుగా ముందుకు సాగని పనులు

. 8లో



సందడిగా హర్ ఘర్ తిరంగా

పాడేరు అంబేద్కర్ కూడలి వద్ద జాతీయ జెండాతో మానవహారం



స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా భారతీయ జనతా యువజన మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం 'హర్ ఘర్ తిరంగా'లో భాగంగా పట్టణంలో 400 మీటర్ల జాతీయ జెండాను ఊరేగించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద భారీ జెండాతో మానవహారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, బీజేవైఎం నేతలు రవి కుమార్, మత్స్యకొండబాబు, పి.రవికుమార్, ఎం.శాంతికుమారి, సల్లా రామకృష్ణ, ఎన్.ఉమామహేశ్, కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.
-ఆంధ్రజ్యోతి/పాడేరు

మురిపించిన మంచు మేఘాలు

చెరువులవేనంలో మంచు సోయగాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు



ఆంధ్రకశ్మీర్ లంబసింగికి సమీపంలోని చెరువులవేనం మంచు సోయగాలు ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. పచ్చని అడవులను తాకుతూ పయనించే మంచు మేఘాలు అమితంగా ఆకట్టుకున్నాయి. మంచు మేఘాలు ఉదయం తొమ్మిది గంటల వరకు చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద కనువిందు చేస్తున్నాయి. దీంతో చెరువులవేనం మంచు అందాలను వీక్షించేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. మంగళవారం వ్యూపాయింట్ వద్దకు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. -చింతపల్లి

'గతిశక్తి' సదస్సులో కలెక్టర్

- జిల్లాలో మౌలిక సదుపాయాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధాన మంత్రి గతిశక్తి' దక్షిణాది రాష్ట్రాల సదస్సులో జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ మంగళవారం పాల్గొన్నారు. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళల్లో ఎంపిక చేసిన 14 జిల్లాల కలెక్టర్లతో కేరళలోని తిరువనంతపురంలో గతిశక్తి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో మౌలిక సదుపాయాలు, సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సదస్సులో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. ఈ సదస్సులో కేరళ రాష్ట్రం పరిశ్రమలు, న్యాయశాఖ మంత్రి పి.రాజేశ్, పలు కేంద్ర మంత్రిత్వ శాఖలకు చెందిన అధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

సమ్మగిరిలో రంగురాళ్లు

వారం రోజుల్లో రూ.పది లక్షల వ్యాపారం

- క్యాట్స్ ఐ రకం రంగురాళ్లు లభ్యం
- నర్సీపట్నం వ్యాపారుల కనుసన్నల్లో తవ్వకాలు
- పట్టించుకోని రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖల అధికారులు

చింతపల్లి, ఆగస్టు 13:

మండలంలోని గొందిపాకలు పంచాయతీ సమ్మగిరి గ్రామంలో రంగురాళ్లు బయటపడ్డాయి. నర్సీపట్నం రంగురాళ్ల వ్యాపారుల కనుసన్నల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. భారీగా తవ్వకాలు జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, అటవీ, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గొందిపాకలు పంచాయతీ సమ్మగిరి గ్రామంలో ఓ రైతు పంట పొలానికి ఆనుకుని ఉన్న కొండ గట్టు వద్ద పది రోజుల క్రితం కొన్ని రంగురాళ్లు బయటపడ్డాయి. వీటిని గమనించిన స్థానికులు తవ్వకాలు ప్రారంభించారు. క్వారీలో లభించిన రంగురాళ్లను నర్సీపట్నం, లోతుగెడ్డ గ్రామాలకు చెందిన రంగురాళ్ల వ్యాపారులు రూ.500, వెయ్యి రూపాయలకు కొనుగోలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న నర్సీపట్నానికి చెందిన రంగురాళ్ల వ్యాపారులు తవ్వకాలు చేపట్టేందుకు రంగ ప్రవేశం చేశారు. స్థానిక గిరిజనులను కూలీలుగా ఏర్పాటు చేసుకుని రాత్రి వేళ నిరాటంకంగా తవ్వకాలు చేయిస్తున్నారు. వారం రోజుల్లో రూ.పది లక్షల రంగురాళ్ల వ్యాపారం జరిగినట్టు సమాచారం. దీంతో రంగురాళ్ల వ్యాపారులు సమ్మగిరి గ్రామానికి క్యూ కడుతున్నారు.



క్యాట్స్ ఐ రకం రంగురాళ్లు

ఏక మార్గంలో తవ్వకాలు

గ్రామంలో రంగురాళ్ల బయటపడిన ... మిగతా 8వ పేజీలో



సమ్మగిరి క్వారీలో లభిస్తున్న రంగురాళ్లు

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- పోలీసులకు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్దార్

పాడేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం ఇటీవల చేసిన కొత్త చట్టాలపై పోలీసు అధికారులు అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో కొత్త చట్టాలపై పాడేరు డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులకు మంగళవారం నిర్వహించిన తొలి రోజు వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా భారత ప్రభుత్వం కొత్త చట్టాలను రూపొందించిందని, వాటిపై సీఐలు, ఎస్ఐలు సంపూర్ణంగా అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. కొత్త చట్టాలపై అవగాహన కలిగినపుడే వాటిని సమర్థవంతంగా అమలు చేయగలుగుతామన్నారు. మంగళ, బుధవారాలు జరిగే ఈ వర్క్‌షాప్‌లో నూతన చట్టాలపై రీసోర్సుపర్సన్, సీనియర్ న్యాయవాది విజయభాస్కర్ సంపూర్ణంగా వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు హిమగిరి, రుద్రశేఖర్, రమేశ్, నవీన్‌కుమార్, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

కోడ్‌కు లోబడే స్వాతంత్ర్య వేడుకలు

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జేసీ డాక్టర్ ఎం.జే.అభిషేక్‌గౌడ్

పాడేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడే జిల్లా కేంద్రంలోని స్వాతంత్ర్య వేడుకలను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జే.అభిషేక్‌గౌడ్ అధికారులకు సూచించారు. స్వాతంత్ర్య వేడుకలపై జిల్లాలోని అధికారులతో మంగళవారం ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్న విషయాన్ని గుర్తుంచుకుని అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే గురువారం ఉదయం తాను తలారిసింగి ఆశ్రమ పాఠశాలలోని వేడుకల్లో పాల్గొంటానన్నారు. అలాగే వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసే వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాలను పాడేరు పట్టణంలో ఊరేగించాలన్నారు. పాడేరులో బుధవారం నాటికి వేడుకలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, చింతూరు ఆర్డీవో కావూరి చైతన్య, డీఆర్వో బి.పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ సమర యోధుడు మర్రి కామయ్య

అంగ్లేయులకు వ్యతిరేకంగా పదేళ్లు పోరాటం

- ముఠాదారులకు శిస్తు, కప్పం కట్టవద్దని గిరిజనులకు పిలుపు
- హుకుంపేట మండలంలో ఆయన పేరిట ఓ గ్రామం

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

మన్యంలో ఆంగ్లేయుల ముఠాదారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసీ యోధుడు మర్రి కామయ్య. ఆయన పదేళ్లపాటు ఆంగ్లేయులకు ముప్పతిప్పలు పెట్టారు. శిస్తు, కప్పం వద్దని గిరిజనులను చైతన్యవంతులుగా చేయడంతో కామయ్యను అరెస్టు చేయడానికి ఆంగ్లేయులు ప్రయత్నించడంతో అజ్ఞాతంలోకి వెళ్లి పోరాటం కొనసాగించారు. హుకుంపేట మండలంలో ఓ గ్రామానికి ఆయన పేరు పెట్టారు.



కామయ్యపేటలో మర్రి కామయ్య స్మారక ప్రదేశం



మర్రి కామయ్య విగ్రహం

ఆంగ్లేయుల పాలనలో హుకుంపేట మండలం తీగలవలస పంచాయతీ గరుడాపల్లి గ్రామానికి చెందిన మర్రి కామయ్య బౌద్ధ మతాన్ని ఆచరిస్తూ చుట్టు పక్కల గిరిజనులకు ఉచిత ములికా వైద్యం చేస్తూ జీవనం సాగించేవారు. దీంతో ఈ ప్రాంతంలో మర్రి కామయ్యకు మంచి పేరుతోపాటు అనుచరులు, శిష్యులు అధికంగా ఉండేవారు. అయితే బ్రిటీష పాలనలో ఆదివాసీ ప్రాంతాల్లో వారి పరిపాలనా సౌలభ్యం కోసం ముఠాదారి వ్యవస్థను ఏర్పాటు చేసి, వారితోనే గిరిజన పల్లెల్లో ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహించేవారు. దీంతో రైతులైన గిరిజనుల నుంచి శిస్తు, కప్పం వంటివి ముఠాదారులు వసూలు చేసి ఆంగ్లేయులకు ఇచ్చేవారు. ఈ క్రమంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను ముఠాదారులు బలవంతంగా లాక్కోవడంతో బాధితులైన గిరిజనులు బౌద్ధ గురువుగా ఉన్న మర్రి కామయ్య వద్దకు వచ్చి తమ గోడును చెప్పుకున్నారు. గిరిజనులను ఇబ్బందులకు గురిచేస్తున్న ముఠాదారీ వ్యవస్థపై మర్రి కామయ్య తిరుగుబాటుకు శ్రీకారం చుట్టారు. ఈక్రమంలో తన శిష్యులుగా ఉన్న కొంతమందిని అనుచరులుగా మార్చుకుని ఆంగ్లేయులు, ముఠాదారులకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఈక్రమంలో గిరిజనుల్ని చైతన్యం చేస్తూ ముఠాదారులకు ఎటువంటి శిస్తులు కట్టవద్దని, భూములను స్వాధీనం చేసుకోడానికి వస్తే తిరగబడాలని కామయ్య పిలుపునిచ్చేవారు. దీంతో మర్రి కామయ్య సంచరించే ప్రాంతాల్లో ఆంగ్లేయులకు తొత్తులుగా ఉన్న ముఠాదారుల ఆటలు సాగనీయకుండా గిరిజనులు ఐక్యంగా తిరుగుబాటు ... మిగతా 8వ పేజీలో

జాముగుడ ఆశ్రమ పాఠశాల

హెచ్‌ఎం, వార్డెన్, టీచర్లకు షోకాజ్‌లు

ఆకస్మిక తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో అభిషేక్

- పాఠశాలకు అందరూ డుమ్మా
- మండిపడిన ఐటీడీఏ పీవో
- విద్యార్థులకు గణితాన్ని బోధించిన పీవో



విద్యార్థులకు గణితాన్ని బోధిస్తున్న పీవో అభిషేక్

డుంబ్రిగుడ, ఆగస్టు 13: మండలంలో మంగళవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ విస్తృతంగా పర్యటించారు. జాముగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో ప్రధానోపాధ్యాయులు, వార్డెన్, ఉపాధ్యాయులు ఎవరూ హాస్టల్‌లో లేకపోవడంతో పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుజాత, ఇన్‌చార్జి డిప్యూటీవార్డెన్ కె.లక్ష్మి, ఇతర ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కొండలరావును ఆదేశించారు. రెండు రోజుల్లో వారి నుంచి సమాధానం రావాలన్నారు. హెచ్‌ఎం, వార్డెన్, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఉపాధ్యాయుల పనితీరు మారకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తర్వాత పదో తరగతి విద్యార్థులకు గణితాన్ని పీవో అభిషేక్ బోధించారు. అనంతరం సోవ్వ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రాన్ని బోధించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అందించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు.

రాజకీయ విలువలకు కట్టుబడే!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా కూటమి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

రాజకీయ విలువలకు కట్టుబడే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నుంచి ఎవరినీ బరిలోకి దింపడం లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కూటమికి భారీ మెజారిటీని కట్టబెట్టారని, జిల్లాలోనే ముగ్గురు అభ్యర్థులు అత్యధిక మెజారిటీ సాధించారన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వచ్చిందన్నారు. రెండేళ్ల క్రితం ఈ ఎన్నిక జరిగినపుడు ప్రతి పక్ష పార్టీల నుంచి ఎవరూ బరిలో దిగకుండా, నామినేషన్లు వేయకుండా వైసీపీ భయాందోళనలకు గురిచేసిందన్నారు. అయితే అలాంటి రాజకీయాలు చేయడం సరైన విధానం కాదని అధిష్ఠానం భావించడంతో పోటీకి దూరమయ్యామన్నారు. వైసీపీకి చెందిన అనేక మంది నాయకులు కూటమిలో చేరుతామని, ఎమ్మెల్సీ అభ్యర్థిని నిలిపితే మద్దతు ఇస్తామని ముందుకు వచ్చారన్నారు. అయితే వారిని పార్టీలోకి తీసుకుని ఎమ్మెల్సీ స్థానం గెలుచుకుని సాధించేదేమీ లేదన్నారు. అయితే జిల్లాలో కూటమికి మెజారిటీ లేదనో, విజయం సాధించలేమనే భయంతోనో తీసుకున్న నిర్ణయం కాదని, ప్రజాస్వామ్యబద్ధంగా సాగాలనే ఉద్దేశంతోనే బరి నుంచి తప్పుకున్నట్టు పల్లా వివరించారు.

ముగిసిన నామినేషన్ల గడువు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్ల గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది. కూటమి నుంచి ఎవరినీ పోటీకి దింపడం లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు వేయలేదు. వైసీపీ తరఫున బొత్స సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా మరో వ్యక్తి సోమవారం సమర్పించిన నామినేషన్లే మిగిలాయి. వీటిని బుధవారం పరిశీలిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

క్రైం... crime news

చాకుతో దాడి చేసిన వార్డు మెంబర్‌పై కేసు నమోదు

కొత్తూరు, ఆగస్టు 13: ఓ వ్యక్తిపై చాకుతో దాడి చేసిన వార్డు మెంబర్‌పై కేసు నమోదు చేశామని అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావు మంగళవారం తెలిపారు. అనకాపల్లి మండలం బవులవాడ రిక్షా కాలనీకి చెందిన ఇద్దరు యువకుల మధ్య గొడవ జరిగింది. అయితే గ్రామ పెద్ద మనిషిగా వార్డు మెంబర్ ఈపు యేసు వెళ్లగా ఆయనపై కూడా తిరగబడ్డారు. ఈ విధంగా వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగి చాకుతో గొర్లి శివపై యేసు దాడి చేశారు. ఈ దాడిలో శివ చెవికి తీవ్రంగా గాయమైంది. ఈ సంఘటనపై శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు యేసుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

బెల్టు షాపులపై దాడి


మద్యం బాటిళ్లతో మునగపాక ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక(తుమ్మపాల), ఆగస్టు 13: మండలంలోని మునగపాకలో మద్యం బెల్టు షాపులపై పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ప్రసాదరావు మాట్లాడుతూ బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

» ఒకరిపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద ఓ వ్యక్తి నుంచి మంగళవారం 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు. లంకెలపాలెం సమీపంలోని గొల్లపేటకు చెందిన బర్ల అప్పారావు పట్టణంలో మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి స్వగ్రామానికి వెళ్లేందుకు సుంకరమెట్ట జంక్షన్‌లో ఉండగా అనుమానం వచ్చి పోలీసులు తనిఖీ చేశారు. 12 మద్యం బాటిళ్లు బయట పడడంతో వాటిని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

కేజీబీవీలో వసతుల పరిశీలన

ఆకస్మికంగా తనిఖీ చేసిన సివిల్ కోర్టు జడ్జి


విద్యార్థినులకు తయారు చేసిన వంటలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి

కోటవురట్ల, ఆగస్టు 13: కోటవురట్ల కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని నర్సీపట్నం సబ్ కోర్టు సివిల్ జడ్డి పటాన్ షియాజ్‌ఖాన్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఆయన నర్సీపట్నం మండలం వేములపూడి, కోటవురట్ల కేజీబీవీ ల్లో మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినుల కోసం తయారు చేసిన భోజనం నాణ్యతను, డైనింగ్‌హాలు, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం లైబ్రరీని తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడిన పాఠశాలలో సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన విచారణ నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పిస్తారు. ఆయన వెంట కోటవురట్ల ఎస్‌ఐ రమణయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ సరితాదేవి, తదితరులు వున్నారు.

సమస్యలు పరిష్కరించండి

» కమిషనర్‌కు మునిసిపల్ కార్మికుల వినతి


కమిషనర్ ప్రభాకరరావుకు వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మిక సంఘం ప్రతినిధులు

ఎలమంచిలి, ఆగస్టు 13 : ఎలమంచిలి మునిసిపాలిటీలో నెలలు తరబడి ఉన్న మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ ప్రభాకరరావుకు మంగళవారం కార్మిక సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు ఆధ్వర్యంలో హోంమంత్రిని కలిసిన కార్మిక ప్రతినిధులు వారి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఏసుదాసు విలేకరులతో మాట్లాడుతూ కార్మికులకు బకాయి పడిన సబ్బులు, నూనెలు, వర్షాకాలం కోటులు, ఏప్రాన్‌లు, బట్టలు వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఏళ్లతరబడి ఉన్న పుష్‌కాట్స్ పాడయ్యాయని, కొత్తవి అందించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు వై.నూకరాజు, సీహెచ్ వెంకటరమణ, డి.మహేష్, జి.రవి పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన


సబ్బవరం-గుల్లేపల్లి రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న విశ్వనాథన్

విశాఖపట్నం, ఆగస్టు 13: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మంగళవారం చినముసిడివాడలో నూతనంగా నిర్మిస్తున్న రెండంతస్తుల కల్యాణ మండపాన్ని పరిశీలించారు. సంస్థకు ఆదాయం పెంచేలా నిర్వహణా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సబ్బవరం నుంచి గుల్లేపల్లి వరకు రూ.5.71 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను తిలకించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చే పనులనువేగవంతం చేయాలన్నారు. అడ్డూరు, పైడివాడ అగ్రహారం, కోడూరు 1,2,3,4, లే అవుట్‌లలో మౌలిక వసతుల కల్పన పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అదేవిధంగా అనకాపల్లి రావుగోపాలరావు కళాక్షేత్రంలో జరుగుతున్న మరమ్మతులను, తుమ్మపాలలో సంస్థకు చెందిన భూములు పరిశీలించారు. ఆ తర్వాత అనకాపల్లి కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆర్‌సీ లేఅవుట్లపై చర్చించారు. ఆయన వెంట ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య ప్రణాళికాధికారి సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	75.00
లైవ్ ధర	95.00
విత్ స్కిన్	160.00
స్కిన్ లెస్	170.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	490
విజయనగరం	494
శ్రీకాకుళం	494

అసంపూర్తిగా ఐసీడీఎస్ కార్యాలయం

రూ. 58 లక్షలతో పనులకు శ్రీకారం

» 2021లో పనులు పూర్తి కాకుండానే ప్రారంభం
» తర్వాత నిలిచిపోయిన పనులు
» కాంట్రాక్టర్‌కు రూ.12 లక్షల బకాయిలు
» మీటింగ్ హాల్, కార్యాలయం కిటికీ రెక్కలు, మరుగుదొడ్లు డోర్లు అమర్చని వైనం
» ఆ భవనంలోనే కార్యాలయం నిర్వహణ


నర్సీపట్నం ఐసీడీఎస్ కార్యాలయం

నర్సీపట్నం, ఆగస్టు 13:
సమగ్ర మహిళ, శిశు సంక్షేమ (ఐసీడీఎస్) కార్యాలయ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పనులు కాకుండానే భవనాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఆ భవనంలోనే ఐసీడీఎస్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

నర్సీపట్నం పట్టణంలోని తురకబడి సమీపంలో కొత్తవీధి రోడ్డులో ఒక అద్దె ఇంట్లో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఉండేది. అక్కడ సరైన సౌకర్యాలు లేక ఉద్యోగులు ఇబ్బంది పడేవారు. ఇంటి యజమాని సైతం భవనం ఖాళీ చేయాలని తరచూ ఒత్తిడి చేసేవారు. ఇక్కడ పరిస్థితిని స్థానిక సీడీపీవో ఉన్నతాధికారులకు వివరించడంతో నూతన కార్యాలయ భవన నిర్మాణానికి 2017-18వ సంవత్సరంలో రూ.58 లక్షలు మంజూరు చేశారు. ఇందుకోసం నర్సీపట్నం- కోటవురట్ల రోడ్డులో స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. నిధులు మంజూరు కావడంతో కాంట్రాక్టర్ కార్యాలయ భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆఫీసు, గోదాము, మొదటి అంతస్తులో మీటింగ్ హాల్ నిర్మాణ పనులు చేశారు. ఇంకా పనులు జరుగుతుండగానే అద్దె భవనం యజమాని ఖాళీ చేయాలని తీవ్ర ఒత్తిడి చేశారు. దీంతో ఐసీడీఎస్ అధికారులు స్థానిక ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్‌తో మాట్లాడడంతో నిర్మాణంలో ఉన్న భవనాన్ని 2021లో ఆయన ప్రారంభించారు. తర్వాత అద్దె భవనం నుంచి కార్యాలయాన్ని అసంపూర్తి భవనంలోకి మార్చారు. అయితే అప్పటి వరకు జరిగిన పనులకు రూ.22 లక్షలను కాంట్రాక్టర్ ఖర్చు చేయగా.. రూ.12 లక్షలు చెల్లించాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశాడు. దీంతో కిటికీ రెక్కలు, మరుగుదొడ్లు డోర్లు, ప్లంబింగ్ పనులు, రంగులు వేయలేదు. మొదటి అంతస్తులో మీటింగ్ హాల్, ప్రహరీ గోడ పనులు చేపట్టాల్సి ఉంది. కిటికీ రెక్కలు లేకపోవడంతో రోడ్డు మీద ధూళి, దుమ్ము రాకుండా కర్టెన్లు కట్టుకుంటున్నారు. వర్షం పడినప్పుడు కిటికీలోంచి జల్లులు ఆఫీసులోని ఫైల్స్ తడిసి పోతున్నాయి. గదుల్లో నీరు వస్తుండడంతో సిబ్బంది ఎత్తిపోయాల్సి వస్తోంది. మరుగుదొడ్లు డోర్లు సీడీపీవో, కార్యాలయ ఉద్యోగులు వేయించారు. భవనంలో ప్లంబింగ్ పనులు పూర్తికాకపోవడంతో శ్లాబ్ మీద నీరు నిలిచిపోతున్నది. అంగన్‌వాడీ సిబ్బందికి మీటింగ్ హాల్ లేక ఇబ్బంది పడుతున్నారు. ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలో నర్సీపట్నం, మాకవరపాలెం మండలాలలో 169 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో మీటింగ్ పెట్టాలంటే ప్రస్తుతం ఉన్న భవనం సరిపోవడం లేదు. అత్యవసరంగా సమావేశ మందిరం నిర్మాణం పూర్తి చేయాలి. కాంట్రాక్టర్ ఆపేసిన పనులు తక్షణమే పూర్తి చేసే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ ఐసీడీఎస్ కార్యాలయ పరిస్థితిని పీడీ అనంతలక్ష్మిని వివరణ కోరగా.. భవనం అసంపూర్తిగా ఉందన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు.


కిటికిలకు రెక్కలు లేకపోవడంతో కట్టిన కర్టెన్లు

వామపక్ష నాయకుల నిరసన

» సహజ వాయువు, చమురు ఉత్పత్తులపై పన్ను విధించే అధికారం రాష్ట్రానికి ఉండాలని డిమాండ్


నెహ్రూచౌక్ వద్ద నిరసన తెలియజేస్తున్న నాయకులు

తుమ్మపాల, ఆగస్టు 13: రాష్ట్రంలోని తూర్పుగోదావరి, కృష్ణా జిల్లా తీర ప్రాంతాల్లో వెలికితీస్తున్న సహజ వాయువు, చమురు ఉత్పత్తులపై పన్ను విధించే అధికారం ఆంధ్రప్రదేశ్‌కు ఉండాలని, వచ్చే ఆదాయంలో 50 శాతం రాష్ట్రానికి కేటాయించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ కాకినాడకు 30 కిలోమీటర్ల దూరంలో సముద్ర గర్భం నుంచి 2024 జనవరి ఏడో తేదీ నుంచి ముడి చమురు ఉత్పత్తి ప్రారంభమైందని, కృష్ణా, గోదావరి బేసిన్‌లో గ్యాస్‌తో పాటు చమురు విలువలు లక్షల కోట్లకు మించి ఉంటాయన్నారు. సహజ వనరులను దేశ సంక్షేమానికి ఉపయోగించే అంశంపై తమకు అభ్యంతరం లేదని, అయితే రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు బి.శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సహజ వనరులను ప్రధాని నరేంద్రమోదీ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో దేశమే కాకుండా ఆయా రాష్ట్రాల సైతం తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు గణేశ్, పీఎస్ అజయ్‌కుమార్, ఐఆర్ గంగాధర్, జి.కోటేశ్వరరావు, బి.సుబ్బలక్ష్మి, బి.పరమేశ్వరి, కోరిబిల్లి శంకరరావు, వియ్యపురాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

» వైద్యవిధాన పరిషత్ జేసీ రమేశ్ కిశోర్


వార్డులో పర్యటిస్తున్న వైద్యవిధాన పరిషత్ జేసీ రమేశ్ కిశోర్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13: రోగులకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్యవిధాన పరిషత్ జాయింట్ కమిషనర్ రమేష్‌కిశోర్ తెలిపారు. మంగళవారం ఆయన ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సందర్శించారు. వార్డులను పరిశీలించి బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను బాలింతలకు అందజేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిటీ స్కాన్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు అవసరమయ్యే సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఆస్పత్రుల్లో గైనిక్ వైద్యుల సంఖ్య పెంచామని చెప్పారు. వైద్యులు తాము పనిచేస్తున్న ప్రధాన కేంద్రాల్లో అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా ఆస్పత్రి అయిన ఎన్టీఆర్ వైద్యాలయానికి మెడిసిన్ బడ్జెట్ పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రోగులకు ఇచ్చే డైట్ చార్జీలు పెంచినందున నాణ్యతమైన ఆహారాన్ని అందించాలని, దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని వైద్యాధికారులకు సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్ఎంవో గౌతమ్ ఉన్నారు.

తంగలాన్ చిత్రం ఆదరించాలి

» సినీ హీరో విక్రమ్
» విశాఖలో సందడి చేసిన యూనిట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న హీరోయిన్ మాళవిక మోహనన్, హీరో విక్రమ్

విశాఖపట్నం (సాగర్‌నగర్), ఆగస్టు 13: తంగలాన్ చిత్రానికి తెలుగు ప్రేక్షకులు అఖండ విజయం అందించాలని సినీ హీరో విక్రమ్ అన్నారు. తంగలాన్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా హీరోయిన్ మాళవిక మోహనన్, నిర్మాత జ్ఞానవేల్ రాజాతో కలిసి మంగళవారం రాడిసన్‌బ్లూ రిసార్ట్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో విక్రమ్ మాట్లాడుతూ.. ఈ చిత్రం నిర్మాణ సమయంలో యూనిట్ ఎంతో శ్రమించినట్టు చెప్పారు. మేకప్ కోసం గంటల సమయం వెచ్చించాల్సి వచ్చేదన్నారు. కఠినతరమైన పాత్రలు పోషించడం, అడ్వెంచర్స్ సృష్టించడం అంటే తనకు ఇష్టమన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు తనను ఎంతగానో ఆదరించారన్నారు. ఈ చిత్రం ఈనెల 15వ తేదీన విడుదల కానున్న నేపథ్యంలో ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన వాస్తవ సంఘటనలను ఆధారం చేసుకుని ఈ చిత్రం తెరకెక్కించామన్నారు. విశాఖ ప్రకృతి అందాలకు నిలయమన్నారు. తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయనున్నామన్నారు. 2022లో ప్రారంభమైన ఈ చిత్ర నిర్మాణం చెన్నై, హైదరాబాద్, మధురై, కర్ణాటక సహా పలు లొకేషన్లలో చిత్రీకరించారు. ఈ చిత్రం ట్రైలర్ విడుదలై ఇప్పటికే అలరిస్తోందన్నారు. ఈ పాన్ ఇండియా సినిమాని రంజిత్ తెరకెక్కించారు. నీలం ప్రొడక్షన్స్, స్టూడియో గ్రీన్, జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించారు. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్, పశుపతి తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. సంగీతం జి.వి. ప్రకాశ్ కుమార్, ఛాయాగ్రహణం ఎ.కిశోర్‌కుమార్ సమకూర్చారు. చిత్రంలో విక్రమ్ డిఫరెంట్ రోల్‌లో కనిపించనున్నారు. కథానాయిక మాళవిక మోహనన్, మరో నటుడు డానియల్ చిత్రానికి సంబంధించి వారి అనుభవాలను పంచుకున్నారు.

వైద్యుల రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలి

» జూనియర్‌వైద్యుల డిమాండ్
» కోల్‌కతా అత్యాచార ఘటనకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో నినాదాలు చేస్తున్న వైద్య విద్యార్థులు

మహారాణిపేట, ఆగస్టు 13: మహిళా వైద్యులకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేసి వారికి రక్షణ కల్పించాలని వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలోని ఆర్‌జీకర్ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనపై వ్యతిరేకంగా ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు మంగళవారం కేజీహెచ్‌లో తమ విధులను బహిష్కరించారు. అనంతరం వైద్య కళాశాలనుంచి జగదాంబ జంక్షన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య విద్యార్థులు మాట్లాడుతూ హత్యాచార ఘటనలో మృతి చెందిన బాధితురాలు ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలందించేందుకు 36 గంటల పాటు విధుల్లో ఉన్నారన్నారు. ఈ సమయంలో ఆమెపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడటం అత్యం త దారుణమని విచారకరమని అన్నారు. ఇలాంటి ఘటన జరగటం దేశానికే సిగ్గు చేటని అన్నారు. ప్రజల వైద్య సేవల్లో మహిళలే ముందుంటున్నారని, వైద్య విద్యలో అధిక శాతం సీట్లు వారే దక్కించుకుంటున్నట్టు వివరించారు. ఈ నేపథ్యం వైద్య సేవలకు రాత్రి సమయంలో ఎక్కడకైనా వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకువచ్చి వైద్యులకు భద్రత కల్పించాల ని డిమాండ్ చేశారు. విద్యార్థిని హత్యాచారానికి పాల్పడిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాల న్నారు. వైద్యులకు రక్షణ కల్పించడంతోపాటు తమ సమస్యలను పరిష్క రించే వరకు అత్యవసర సేవలు మిన హా మిగిలిన సేవలను బహిష్కరిస్తూ నిరవధిక సమ్మె చేయనున్నట్టు జూని యర్ వైద్యులు ప్రక టించారు. ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో జూనియర్ వైద్యులు పాల్గొన్నారు.

బంగారమ్మతల్లి సన్నిధిలో హోం మంత్రి అనిత


బంగారమ్మతల్లిని దర్శించుకుంటున్న హోం మంత్రి వంగలపూడి అనిత

ఎస్.రాయవరం, ఆగస్టు 13: మండలంలోని రేవుపోలవరం గ్రామంలో ఉన్న బంగారమ్మతల్లిని హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల ముందు ఇక్కడి అమ్మవారికి మొక్కుకున్న నేపథ్యంలో మొక్కును చెల్లించడంలో భాగంగా బంగారమ్మతల్లి అమ్మవారి ఆలయానికి వచ్చిన అనిత ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అనంతరం అమ్మవారికి మొక్కు చెల్లించారు. అంతకు ముందు తమ గ్రామానికి వచ్చిన హోం మంత్రి అనితకు స్థానిక టీడీపీ నేతలతో పాటు అధిక సంఖ్యలో మహిళలు ఘనస్వాగతం పలికారు. స్థానిక నాయకులు, గ్రామస్థులు కలిసి బంగారమ్మతల్లి చిత్రపటాన్ని ఆమెకు బహూకరించారు. ఆలయానికి వచ్చిన మహిళలను అనిత ఆప్యాయంగా పలకరించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానిక టీడీపీ నేతలు ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ అధ్యక్షుడు వెంకటరాజు, సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, కోడ లోవరాజు, కె.బంగారి, అడవి రాజు, అప్పన్న, జోగారావు, అప్పలరాజు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జోగి రమేశ్ అక్రమాలు బట్టబయలు

» మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు



అనకాపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన నిలబడతామని 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన జోగి రమేశ్ అధికార దుర్వినియోగానికి పాల్పడి చేసిన అక్రమాలు బయటకు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు మంగళవారం ఆయన మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన కుటుంబ సభ్యుల అక్రమాలు, అధికార దుర్వినియోగంపై ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ అధికారంలో ఉండగా జోగి రమేశ్ రౌడీలను వెంటబెట్టుకొని ఉండవల్లిలో చంద్రబాబు ఇంటి మీదకు వచ్చి నానా యాగీ చేసిన సంగతి మరిచిపోయారా? అని ప్రశ్నించారు. నకిలీ సర్వే నంబర్లతో అగ్రిగోల్డ్ భూములను కాజేశారని, అగ్రిగోల్డ్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు విచారణ జరిపి జోగి రాజును అరెస్టు చేశారని, ఇందులో ఎటువంటి రాజకీయ కక్ష సాధింపు చర్యలు లేవన్నారు.

'దరఖాస్తుదారులను ఇబ్బంది పెట్టడం సరికాదు'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13: రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ దరఖాస్తుదారునికి గడువులోగా పూర్తి సమాచారాన్ని ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడం పట్ల రాష్ట్ర సమాచార కమిషనర్ మహబూబ్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తుదారులను ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఆర్‌టీఐ చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ 2019 ఏప్రిల్ ఒకటి నుంచి సమాచారం ఇచ్చే తేదీ వరకు జారీ చేసిన ప్రకటనలు, ప్రసార మాధ్యమాల పేర్లు, ప్రకటనల విలువ, ఆర్‌వోలు, చెల్లింపులు, బకాయిల వివరాలు, ప్రసార మాధ్యమాలు ఎంపానల్‌మెంట్ నియమావళి కోసం 2022 నవంబరు 16వ తేదీన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖకు దరఖాస్తు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో రాష్ట్ర సమాచార కమిషన్‌ను వెంకటరమణ ఆశ్రయించారు. మంగళవారం వర్చువల్ విధానంలో విచారణ నిర్వహించారు. దరఖాస్తుదారుడు కోరిన పూర్తి సమాచారాన్ని వచ్చే నెల 19వ తేదీలోగా అందజేయాలని స్పష్టం చేశారు.

పెన్షన్లకు దరఖాస్తు చేయండి

» మహిళలకు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచన


మహిళలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్లకు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. స్థానిక జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో సెర్ప్, డీఆర్‌డీఏ వితంతు పింఛన్లపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేయాలనుకున్న వారు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటును సంప్రదించాలని సూచించారు. సచివాలయానికి వెళితే ఎలా దరఖాస్తు చేయాలో తెలియజేస్తారన్నారు. ఏదైనా కారణంతో సచివాలయంలో తమ పనికాకుంటే ఐటీడీఏ కార్యాలయానికి రావాలన్నారు. అలాగే బియ్యం కార్డులో భర్త పేరు ఉంటే పింఛను మంజూరు చేయడం జరగదని, భర్త మృతి చెంది ఉంటే రేషన్ కార్డులో పేరు తొలగించాలన్నారు. అలాగే మండల కేంద్రాల్లో వారపు సంత రోజున పింఛన్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ఒక రోజు మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించాలని ఐటీడీఏ పీవో సూచించారు. అనంతరం వెలుగు ఆధ్వర్యం నిర్వహిస్తున్న విస్తర్ల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అడ్డాకులతో తయారు చేసిన ప్లేట్లు, కప్పులను స్థానిక హోటళ్లకు సరఫరా చేయాలని పీవో సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ వి.మురళీ, ఎంపీడీవో సాయినవీన్, ఈవోపీఆర్‌డీ రమేశ్, లీగల్ అడ్వయిజర్లు టి.ప్రసాద్‌నాయుడు, అశోక్ పాల్గొన్నారు.

బ్రహ్మపూర్ రైలు శ్రీకాకుళంరోడ్డు వరకే..

విశాఖపట్నం, ఆగస్టు 13: వాల్తేరు డివిజన్ పరిధిలోని పూండి, నౌపడ సెక్షన్‌లో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ, బ్రహ్మపూర్ నడిచే రైలు సర్వీసుల గమ్యాన్ని కుదించామని సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీంతో విశాఖ నుంచి బ్రహ్మపూర్ వెళ్లే 08532 నంబరు గల రైలు ఈనెల 18న విశాఖ నుంచి శ్రీకాకుళం రోడ్డు వరకు, తిరుగు ప్రయాణంలోని బ్రహ్మపూర్ నుంచి విశాఖ వచ్చే 08533 నంబరు గల రైలు ఈనెల 19న శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ నుంచి బయలుదేరి విశాఖ చేరుతుందని పేర్కొన్నారు. శ్రీకాకుళం రోడ్డు, బ్రహ్మపూర్ మధ్య రాకపోకలు తాత్కాలికంగా రద్దు చేసామన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పెన్షన్లకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోండి

▸▸ మహిళలకు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచన

పాడేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్లకు సంబంధించి గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. స్థానిక జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో వితంతు పింఛన్లపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేయాలనుకున్న వారు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని సూచించారు. సచివాలయానికి వెళితే ఎలా దరఖాస్తు చేయాలో తెలియజేస్తారన్నారు. ఏదైనా కారణంతో సచివాలయంలో పని కాకపోతే ఐటీడీఏ కార్యాలయానికి రావాలని ఆయన సూచించారు. అలాగే బియ్యం కార్డులో భర్త పేరు ఉంటే పింఛను మంజూరు చేయడం జరగదని, భర్త మృతి చెంది ఉంటే రేషన్ కార్డులో పేరు తొలగించాలని చెప్పారు. ఏజెన్సీలోని మండల కేంద్రాల్లో వారపు సంత రోజున పింఛన్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించాలని ఐటీడీఏ పీవో సూచించారు. అలాగే పది ఎకరాల మెట్ట భూమి, మూడు ఎకరాల పల్లపు భూమి ఉంటే పింఛన్ మంజూరుకు అనర్హులన్నారు. అనంతరం వెలుగు ఆధ్వర్యం నిర్వహిస్తున్న విస్తర్ల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అడ్డాకులతో తయారు చేసిన ప్లేట్లు, కప్పులను స్థానిక హోటళ్లకు సరఫరా చేయాలని పీవో సూచించారు. అలాగే హోటళ్లలో ప్లాస్టిక్ వినియోగం నిషేధాన్ని పర్యవేక్షించాలని ఎంపీడీవోలను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ వి.మురళి, ఎంపీడీవో సాయినవీన్, ఈవోఆర్‌డీ రమేశ్, లీడల్ అడ్వయిజర్లు టి.ప్రసాద్‌నాయుడు, ఎస్.అశోక్, పలువురు స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు: పీవో

డుంబ్రిగుడ, ఆగస్టు 13: మాతాశిశు మరణాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. మండలంలో మంగళవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా డుంబ్రిగుడ పీహెచ్‌సిలో తనిఖీలు చేపట్టారు. శిశు జనన నిరీక్షణ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులతో మాట్లాడారు. పోషకాహార కల్పనపై ఆరా తీశారు. గర్భిణులకు నాణ్యమైన భోజన మెనూను పక్కాగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. నెలల నిండినప్పటికీ ఆసుపత్రికి రానివారిపై సమాచారం అందిస్తే ఆసుపత్రిలో చేర్పించేందుకు రెవెన్యూ శాఖతో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. తర్వాత ఆయుర్వేద వైద్యశాలలో సందర్శించిన ఆయన మందులను పరిశీలించారు. ఐదేళ్లుగా అటెండరే విధులు చేపడుతుండడంపై ఆయన విస్మయం చెందారు. నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ నెలాఖరులోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి చుట్టూ ఉన్న తుప్పలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి నిధులతో నైట్ వాచ్‌మెన్‌ను నియమించేలా చూసుకోవాలని వైద్యాధికారి అంబికకు సూచించారు. అనంతరం అరమ పంచాయతీ పరిధిలోని జాకర వలసను పరిశీలించారు. జామగుడ, కిల్లోగుడ ఆంగ్ల మాధ్యమ, బాలికల పాఠశాలలను తనిఖీలు చేశారు. ఆయన వెంట టీడబ్ల్యూ డీడీ కొండలరావు, ఏఈ అభిషేక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్న సీడీపీవో


కొయ్యూరు, ఆగస్టు 13: అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా తెరిచి లబ్ధిదారులకు సక్రమంగా సరకులు అందాలని సీడీపీవో విజయకుమారి ఆదేశించారు. మంగళవారం మండలంలో బంగారమ్మపేట, గుమ్మల్లపాలెం, నడింపాలెం, గుజ్జుమానుపాకలు, కొత్తపల్లి తదితర అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. గ్రామాల్లో బాలింతలు, గర్భిణులు, బాలబాలికలకు సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలన్నారు. ఈ విషయంలో తేడాలు వస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

కొండచీపుర్ల తయారీపై శిక్షణ



కొండ చీపుర్ల తయారీపై శిక్షణ ఇస్తున్న సిఫా సంస్థ ప్రతినిధులు

కొయ్యూరు, ఆగస్టు 13: మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడానికి కొండచీపుర్ల తయారీపై శిక్షణ ఇస్తున్నట్టు సిఫా సంస్థ డైరెక్టర్ శశిప్రభ తెలిపారు. డౌనూరు పంచాయతీ పరిధిలోని గుమ్మడివానిపాలెంలో మంగళవారం కొండచీపుర్ల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో మూడు రోజుల పాటు 15 మంది డ్వాక్రా మహిళలకు వీటి తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇందుకు అవసరమైన ముడి సరకును సంస్థ సమకూర్చి శిక్షణ ఇస్తుందన్నారు. మహిళలు స్వయం ఉపాధి సాధించటమే ఈ శిక్షణ ప్రధానోద్దేశమన్నారు. మహిళలు రోజువారీ, సాధారణ సంపాదనతో పాటు అదనపు ఆదాయం పొందేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ మహిళా కోఆర్డినేటర్లు రాజేశ్వరి, స్వప్న, తులసి పాల్గొన్నారు.



పాడేరులో మంగళవారం సాయంత్రం ఆకాశంలో ఆవిష్కృతమైన దృశ్యం

ఆకాశం ఎందుకో ఎర్రబడ్డది..!

జిల్లా కేంద్రం పాడేరులో మంగళవారం సాయంత్రం ఐదున్నర గంటల తర్వాత ఆకాశంలో భిన్నమైన వర్ణం దర్శనమిచ్చింది. అప్పటి వరకు సాధారణంగా ఉన్న ఆకాశం సూర్యాస్తమం అయిన తర్వాత ఒక్కసారిగా ఆకాశామంతా ఎర్రబడినట్లుగా రంగు మారింది. ఎంతో రమణీయంగా ఉన్న అదృశ్యాన్ని తిలకించేందుకు అందరూ ఆసక్తి చూపారు.

-పాడేరు, ఆంధ్రజ్యోతి

అక్కరకురాని ఆర్వో ప్లాంట్

▸▸ తుది దశలో నిలిచిపోయిన నిర్మాణాలు

▸▸ మూడేళ్లుగా ముందుకు సాగని పనులు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 13: మండల కేంద్రంలోని పీకే గూడెం గ్రామంలో నిర్మించిన ఆర్వో ప్లాంట్ ఆదివాసీలకు అందుబాటులోకి రావడం లేదు. మూడేళ్లుగా దీన్ని వినియోగంలోకి తీసుకువచ్చే చర్యలు చేపట్టడం లేదు. తుది దశ నిర్మాణాలను ఆపేయడం.. తదనంతరం దాన్ని ఎవరూ పట్టించుకునే పాపానికి పోకపోవడంతో ఆదివాసీలు కలుషిత ఊటగెడ్డ నీరే శరణ్యమవుతోంది.

పీకే గూడెం గ్రామంలో ఆదివాసీలకు రక్షిత నీరు అందించేందుకు 2020-21లో ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి ఐటీడీఏ సుమారు రూ.6 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో పథకం నిర్మాణ బాధ్యతలు పొందిన కాంట్రాక్టర్ షెడ్ నిర్మాణం పూర్తి చేశాడు. అంతటితో తన పనైపోయిందని అనుకున్నారో ఏమోగాని, ఆర్వో ప్లాంట్‌కు అవసరమైన పూర్తి స్థాయి యంత్ర సామగ్రిని ఏర్పాటు చేయలేదు. దీంతో మూడేళ్లుగా అది నిరుపయోగంగా దర్శనమిస్తున్నది. ఆదివాసీలకు రక్షిత నీరు అందుబాటులో రాకపోవడంతో కలుషితమైన ఊటగెడ్డ నీటిని తాగుతూ తరచూ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైన జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి ఆర్వో ప్లాంట్ వినియోగంలోకి తీసుకురావడానికి తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని ఆదివాసీలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆర్వో ప్లాంట్ వద్ద నిరసన తెలుపుతున్న ఆదివాసీలు

బేస్‌లైన్ పరీక్ష పేపర్లు పక్కాగా తయారు చేయండి

▸▸ గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు కొండలరావు

పాడేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలను నిర్వహించేందుకు అవసరమైన పేపర్ల తయారు చేయాలని గిరిజన సంక్షేమ విద్యా శాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు సూచించారు. తన కార్యాలయంలో ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోలు, హెచ్‌ఎంలతో బేస్‌లైన్ టెస్ట్ పేపరు తయారీపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్‌లోని విద్యాలయాల్లో మూడు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే ప్రశ్నాపత్రాల రూపకల్పనతో పాటు వాటి మూల్యాంకనం సైతం పకడ్బందీగా నిర్వహించాలని టీడబ్ల్యూ డీడీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, ఎంఈవోలు, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



బేస్‌లైన్ పేపర్ల తయారీపై సమావేశంలో మాట్లాడుతున్న డీడీ కొండలరావు

హుందా రాజకీయాలే కూటమి ప్రభుత్వ లక్ష్యం: గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, ఆగస్టు 13: హుందా రాజకీయాలే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ముందున్న లక్ష్యం రాష్ట్ర పునర్నిర్మాణమన్నారు. స్థానిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ అక్రమాల కారణంగా నాడు ఎన్నికల్లో పోటీకి టీడీపీ దూరంగా ఉందన్నారు. అధికార మార్పిడి తరువాత స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున కూటమి వైపు వచ్చారని వివరించారు. కూటమి ప్రభుత్వానికి గెలుపు ముఖ్యం కాదని స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయాలు, విలువలే ప్రధానమని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ముందున్న లక్ష్యం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి అని గుర్తు చేశారు. విశాఖ ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి ప్రభుత్వం దూరంగా ఉండి రాజనీతజ్ఞుడులా చంద్రబాబు నాయుడు వ్యవహరించడం సంతోషకర విషయమన్నారు.

ఛత్తీస్‌ఘఢ్ విలేకర్లపై అక్రమ గంజాయి కేసు ఎత్తివేయాలి

పాడేరు రూరల్, ఆగస్టు 13: జిల్లాలోని చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన విలేకరులపై పెట్టిన అక్రమ గంజాయి కేసు ఎత్తివేయాలని ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, ఐజేయూ కార్యదర్శి సోమసుందర్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు నాగరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏపీలోని చింతూరు, ఛత్తీస్‌ఘడ్‌లోని కుంట పోలీస్ స్టేషన్ సీఐలు విలేకరులపై ఇంత కక్షపూరితంగా వ్యవహరించిన శైలి అమానుషమన్నారు. పాత్రికేయులు ఇసుక మాఫియాకు సంబంధించి బెదిరింపులు చేశారనే ఆరోపణలను పరిగణలోకి తీసుకుంటే చట్టపరంగా విచారణ చేయాలన్నారు. అదే సమయంలో విలేకరులు వార్త సేకరణకు వచ్చారా? బ్లాక్‌మెయిలింగ్ కోసం వచ్చారా? అనే విషయంపై సమగ్ర విచారణ జరపాలని ఆయన స్పష్టం చేశారు. ఇసుక మాఫియా ఒత్తిడిలకు లొంగి విలేకరులపై కేసు పెట్టిన పోలీసులు, అక్రమంగా శబరి నది నుంచి ఇసుక తరలిస్తున్న మాఫియాపై ఎందుకు పెట్టలేదని వారు ప్రశ్నించారు. పోలీసులే 40 కిలోల గంజాయిని విలేకరుల కారు డిక్కీలో పెట్టారన్న ఆరోపణలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలన్నారు. విలేకరుల బస చేసిన లాడ్జీలోని సీసీ ఫుటేజీ మొత్తం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసుల అక్రమాలను ప్రశ్నించే విలేకరులపై ఇలా గంజాయి కేసులు పెట్టడం అన్యాయమన్నారు. కుంట సీఐపై ఉన్నత స్థాయి అధికారులకు జర్నలిస్టు పిర్యాదు చేశారన్న కక్షతో కారులో గంజాయి పెట్టి చింతూరు పోలీసులుతో కేసు పెట్టించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి ఛత్తీస్‌ఘడ్ విలేకరులపై చింతూరులో పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వారపు సంతల్లో సదుపాయాలు కల్పించాలి

ముంచంగిపుట్టు, ఆగస్టు 13: మండల కేంద్రంతో పాటు జోలాపుట్టు, లక్ష్మీపురం , బంగారుమెట్ట, బూసిపుట్టులో జరిగే వారపు సంతల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సంతల్లో కనీస సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సంతల్లో షెడ్లు, మరుగుదొడ్లు నిర్మించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, విశ్రాంతి భవనం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. సంతల్లో సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన బాట పడతామని ఆయన హెచ్చరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

అనంతగిరి, ఆగస్టు 13: మండల కేంద్రంలో పీహెచ్‌సీ వద్ద మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యాధికారులు గౌతమ్, మణికంఠ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ప్రమాదకరమేగాని, ముందస్తుగా గుర్తిస్తే ప్రాణంతకం కాదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్యులు జ్ఞానేశ్వరి, జాహ్నవి, నరసింగరావు, కనకామేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదివాసీ సమర యోధుడు మర్రి కామయ్య

... 5వ పేజీ తరువాయి

చేశారు. 1930 ప్రాంతంలో దశాబ్దకాలం మర్రి కామయ్య తన పోరాటాన్ని సాగించారు. ఈ క్రమంలో ఆయన్ని అరెస్టు చేసి జైలులో పెట్టాలని ఆంగ్లేయులు భావించినప్పటికీ, స్థానికుల సహకారంతో ఆయన అజ్ఞాతంలో ఉంటూనే పోరాటం కొనసాగించారు. వృద్ధాప్యంతో ఆయన 1959లో మృతి చెందారని, అప్పటికి ఆయన వయస్సు 65 నుంచి 70 సంవత్సరాల మధ్యలో ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

గిరిజన గ్రామానికి మర్రి కామయ్య పేరు

ప్రస్తుతం కామయ్యపేటగా పిలుస్తున్న గ్రామం పేరు పూర్వం బీటుబయలుగా పిలిచేవారు. కామయ్య మృతి అనంతరం ఆయన స్మారకార్థం ఈ గ్రామానికి కామయ్యపేటగా నామకరణం చేశారు. గరుడాపల్లికి చెందిన కామయ్య ఆఖరి సమయంలో కామయ్యపేటలోనే తలదాచుకుని తుదిశ్వాస విడిచారు. దీంతో ఆయనను సమాధి చేసిన స్మారక ప్రదేశంలో 1981లో పెంకులతో స్మారక షెడ్‌ను నిర్మించారు. అలాగే తీగలవలస పంచాయతీ మాజీ సర్పంచ్ పి.కామేశ్వరరావు స్మారక ప్రదేశంలో మర్రి కామయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అలాగే ప్రతి ఏడాది మే ఐదో తేదీన మర్రి కామయ్య వర్ధంతిని గిరిజన సంఘాల నేతలు, స్థానికులు ఘనంగా నిర్వహిస్తుంటారు.

హుకుంపేటలో అక్రమ నిర్మాణాల పరిశీలన



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

హుకుంపేట ఆగస్టు 13: గిరిజనేతరులు అక్రమంగా నిర్మిస్తున్న భవనాలను మంగళవారం ఐటీడీఏ పీవో అభిషేక్, డిప్యూటీ కలెక్టర్ శర్మ పరిశీలించారు. వీటి గురించి రెవెన్యూ శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, లేనిపోంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా గిరిజన సంఘ నాయకులు స్పష్టం చేశారు. అనంతరం తహశీల్దార్ రాజ్యలక్ష్మి, వీఆర్వో కొండబాబు, గిరిజన సంఘ నాయకులు టి.క్రిష్ణారావు, రామారావు, గిరిజనులు పాల్గొన్నారు

మద్యం దుకాణాల ఉద్యోగులకు భద్రత కల్పించాలి



జేసీకి వినతిపత్రం అందిస్తున్న మద్యం దుకాణాల ఉద్యోగులు, నాయకులు

పాడేరు రూరల్, ఆగస్టు 13: ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందించామని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ జల్లి రాజబాబు, కో-కన్వీనర్ అమర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకువస్తామని రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం కావడంతో ఉద్యోగుల్లో భయాందోళన నెలకొందన్నారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కు వినతులు అందించినప్పటికీ స్పష్టమైన వైఖరిని తెలపలేదన్నారు. టెండర్ల పద్ధతిలో మద్యం దుకాణాలకు అనుమతులు ఇస్తే ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులు రోడ్డున పడతారన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమణ, బాలకృష్ణ, రామారావు, నారాయణ, నర్సింగ్, సంజీవ్, రవికుమార్ పాల్గొన్నారు.

కుంట ఎస్‌ఐపై సస్పెన్షన్ వేటు

▸▸ విలేకరులపై కుట్ర కోణమే కారణం..

చింతూరు, ఆగస్టు 13: ఛత్తీస్‌గడ్ రాష్ట్రం సుక్మాజిల్లా కుంట పోలీస్ స్టేషను ఎస్‌ఐ అజయ్ సోంకర్‌పై మంగళవారం కేసు నమోదైంది. వెనువెంటనే ఎస్‌ఐని సస్పెండ్ చేసినట్లు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ గంగారావ్‌చౌవాన్ పేర్కొన్నారు. విలేకరులను గంజాయి కేసులో ఇరికించ డం వెనుక ఎస్‌ఐ పాత్ర ఉందన్న ఆరోణలు వినవస్తున్నందున పూర్తి స్థాయి విచారణ జరిపిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ముందుగా ఆరోపణలను ఎదుర్కొంటున్న ఎస్‌ఐని సస్పెండ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. అల్లూరిసీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు సోమవారం ఛత్తీస్‌గడ్‌కు చెందిన నలుగురు వ్యక్తులను గంజాయి కేసులో నిందితులుగా పేర్కొంటూ అరెస్టు చేసిన విషయం విధితమే. కాగా అరెస్టు అయిన నలుగురు వ్యక్తులు కూడా ఛత్తీస్‌గడ్‌లోని వివిధ పత్రికలకు విలేకరులుగా వ్యవహరిస్తున్నారు. ఇదిలావుండగా విలేకరుల అరెస్టు వెనుక కుంట ఎస్‌ఐ కుట్ర కోణం దాగి ఉన్నదన్న ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. దీంతో ఛత్తీస్‌గడ్‌లో జర్నలిస్టు సంఘాలు తీవ్ర నిరసనకు దిగాయి. అదే దశలో ఆ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్ళడం జరిగింది. ఇక జర్నలిస్టుల నిరసన గొంతుకు ఆ రాష్ట్ర ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం తన గొంతును కలిపింది. ఇటు మన రాష్ట్రంలో కూడా జర్నలిస్టు సంఘాలు విలేకరులపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదంటూ నిరసన వ్యక్తం చేసింది. ఛత్తీస్‌గడ్ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు చేపట్టిన విచారణలో ఎస్‌ఐ పాత్ర, కుట్ర ఉందన్న విషయం స్పష్టమైన క్రమంలో కుట్రకు గల కారణాలు ఆ కుట్రలో ఎవరెవరు భాగస్వాములో కూడా తేటతెల్లమయ్యే పరిస్థితి లేకపోలేదన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి.

సమ్మగిరిలో రంగురాళ్లు

... 5వ పేజీ తరువాయి

క్వారీలో కూలీలు ఏక మార్గంలో తవ్వకాలు సాగిస్తున్నారు. క్వారీలో బయటపడిన కొన్ని రంగురాళ్ల క్యాట్స్ ఐ (మేలిజాతి) రకానికి చెందినవి ఉన్నట్టు వ్యాపారులే చెబుతున్నారు. క్వారీలో లోతుగా తవ్వకాలు సాగిస్తే మరిన్ని లభిస్తాయని వారంటున్నారు. ఏక మార్గంలో తవ్వకాలు సాగించడం వల్ల సొరంగం ఏర్పడి మట్టిపెళ్లలు విరిగి కూలీలపై పడే అవకాశం లేకపోలేదు. ఇదే జరిగితే సిగినాపల్లి క్వారీ మాదిరిగా తవ్వకాలు సాగించే కూలీలు సొరంగం కూలి మరణించే అవకాశం లేకపోలేదు.

పట్టించుకోని అధికారులు..

వారం రోజులుగా రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు కనీసం పట్టించుకోలేదు. డి పట్టా భూమిలో రంగురాళ్లు పడడంతో అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు తవ్వకాలను నియంత్రించాల్సి వున్నది. పోలీసులు కూడా జోక్యం చేసుకోవాలి. అయితే అధికారులు వెంటనే స్పందించకపోవడం వల్ల రంగురాళ్ల వ్యాపారుల ఇష్టారాజ్యమైంది. ఇప్పటికైన అధికార యంత్రాంగం స్పందించకుంటే క్వారీలో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు.

☛ సంక్షిప్తంగా..

తొమ్మిది గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

కొయ్యూరు, ఆగస్టు 13: మంపంభీమవరం పంచాయతీలో నెల రోజులుగా అంధకారంలో మగ్గుతున్న తొమ్మిది గ్రామాలలో మంగళవారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'అంధకారంలో గిరిజన గ్రామాలు' పేరుతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి ఆ శాఖ ఉద్యోగులు స్పందించారు. ఈ మేరకు సాంకేతిక సమస్యను గుర్తించి మంగళవారం సాయంత్రానికి పునరుద్ధరించారు. దీంతో కాకులమామిడి, జాలిగెడ్డ, మడికోట, గాదిమామిడి, పుట్టకోట, పీఎల్ కొత్తూరు, బొబ్బిలికొండ, బుగ్గిరాయి, మైనకోట గ్రామాలో విద్యుత్ దీపాలు వెలిగాయి. నెల రోజులుగా అంధకారంలో మగ్గుతున్న విషయాన్ని వెలుగులోకి తెచ్చి తిరిగి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి' వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

జి.మాడుగుల, ఆగస్టు 13: మద్యం తాగి విధులకు హాజరైన ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. పెదలోచలి ఆశ్రమ పాఠశాలను ఈ నెల 8వ తేదీన ఏటీడబ్ల్యూవో తిరుపాల్ ఆకస్మికంగా సందర్శించినప్పుడు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న అప్పలకొండ అనే ఉపాధ్యాయుడు వసతి గృహంలో మద్యం తాగి పడుకుని ఉండడాన్ని గుర్తించారు. దీంతో 'మద్యం సేవించి పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడు' అనే శీర్షికతో 9న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం వచ్చింది. దీనిపై అధికారులు విచారణ చేపట్టి సదరు ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు వేస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఇదే పాఠశాలలో హెచ్‌ఎం నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఉన్నతాధికారులు ఇటీవలే సస్పెండ్ చేశారు. మరో ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు అందించారు.

తహసీల్దార్‌గా తిరుమలరావు బాధ్యతల స్వీకారం

కొయ్యూరు, ఆగస్టు 13: తహసీల్దారుగా తిరిగి తిరుమలరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మార్చిలో జరిగిన బదిలీలలో పార్వతీపురానికి ఆయన వెళ్లారు. తిరిగి ఇటీవల జరిగిన తహసీల్దార్ల బదిలీ ప్రక్రియలో తిరుమలరావును కొయ్యూరులో నియమిస్తూ జిల్లా కలెక్టరు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తిరిగి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా ప్రభావతి

చింతపల్లి, ఆగస్టు 13: స్థానిక ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్‌గా చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గంట ప్రభావతి నియమితులయ్యారు. సోమవారం రాత్రి చింతపల్లి ఏరియా ఆస్పత్రిని అమరావతి డైరెక్టరేట్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేశ్ కిశోర్ సందర్శించి, రోగులకు అందుతున్న వైద్యసేవలు, వైద్యుల పనితీరు, ఆస్పత్రి నిర్వహణను పరిశీలించారు. ఈ మేరకు ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించడంలో పలు పరిపాలన లోపాలను జాయింట్ కమిషనర్ గుర్తించి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ చంద్రశేఖర రావు తొలగించారు. వెనువెంటనే సీనియర్ వైద్యాధికారి ప్రభావతిని సూపరింటెండెంట్‌గా నియమిస్తూ రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా ఆర్థికలావాదేవిలకు ఆటంకం కలగకుండా డీడీవో అధికారాలు పూర్వ సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు కొనసాగిస్తారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్, ఆగస్టు 13: 2024-25 విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) కోసం జిల్లాలో ఎనిమిదోతరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పి.బ్రహ్మాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష రాసేందుకు ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎనిమిదోతరగతి చదువుతూ, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షల 50 వేలు లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఈ ఏడాది డిసెంబరు 8న పరీక్ష జరుగుతుందని, పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. ఆసక్తి గల విద్యార్థుల ఈ నెల 5వ తేదీ నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. వచ్చే నెల 6వ తేదీ వరకు స్వీకరిస్తారని ఆయన చెప్పారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

చింతపల్లి, ఆగస్టు 13: గిరిజన రైతులందరూ ఈ-పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పెదబరడ పంచాయతీ కేంద్రంలో ఈ-పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ, పీఎం పసల బీమా, ధాన్యం కొనుగోలు, బిందు సేద్యం, రాయితీ వ్యవసాయ యంత్రాల పథకాలు అందుతాయన్నారు. వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, వీఆర్వోలు గ్రామాలకు వచ్చి ఈ-పంట నమోదు చేస్తారన్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు విజ్ఞానం

చింతపల్లి, ఆగస్టు 13: పుస్తక పఠనం విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందిస్తుందని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసపాత్రుడు అన్నారు. మంగళవారం కళాశాలలో గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతి వేడుక, గ్రంథాలయం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత రంగనాథన్ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రంథాలయ సైన్సు, గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాథన్ ఎనలేని కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనమని పేర్కొన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థి దశలోనే గ్రంథాలయంలో పుస్తక పఠనానికి అధిక సమయం కేటాయించాలని సూచించారు. పుస్తక పఠనం అలవర్చుకున్న విద్యార్థులు పోటీపరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు డి.కెజియ, గ్రంథాలయ అధికారి టి.జగత్‌రాయ్, సహాయక గ్రంథాలయ అధికారి నాగరాజు పాల్గొన్నారు.